18న మున్నూరుకాపుల జన చైతన్య పాదయాత్ర

కాచిగూడ: మున్నూరుకాపులు సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని మున్నూరుకాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన రాష్ట్ర అధ్యక్షుడు ఉగ్గే శ్రీనివాస్ పటేల్ డిమాండ్ చేశారు. మున్నూరుకాపుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టి మున్నూరుకాపుల్లో చైతన్యం తీసుకురావడానికి 20 రోజుల పాటు మహా పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మంగళవారం కాచిగూడలో మీడియాతో మాట్లాడుతూ...ఈనెల 18వ తేదీన మహబూబ్‌నగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద పాదయాత్ర ప్రారంభమవుతుందని అన్నారు. సెప్టెంబర్ 6వ తేదీన వరంగల్ జిల్లాలో పాదయాత్ర ముగుస్తుందని పేర్కొన్నారు. మున్నూరుకాపులందరూ పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బత్తుల రాములు, కటికం మహేష్, అమరం శ్యామ్, పత్తి అనిల్, రాయని సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయించండి



కాచిగూడ: అంబర్‌పేట నియోజవకర్గంలో పెండింగ్ అభివృద్ధి పనులను పూర్తి చేయించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మంగళవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. కొత్త పనులకు శ్రీకారం చుట్టాలని కోరారు. ఇప్పటి వరకు జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని కోరారు.

కనీస వేతనాల జీఓను విడుదల చేయాలి

చిక్కడపల్లి: కనీస వేతనాల జీఓను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షుడు కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం క్రాస్‌రోడ్డులోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట కనీస వేతనాల జీఓను సవరించాలని నిరసన తెలిపారు. అనంతరం కార్మికశాఖ డీసీఎల్ బి.జాసన్‌కు సీఐటీయూ సిటీ కమిటీ అధ్యక్షుడు కుమారస్వామి వినతిపత్రం అందజేశారు. 2021 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం 5 ప్రిలిమినరీ జీఓలను విడుదల చేసిందన్నారు. యాజమాన్యాల ఒత్తిడితో అప్పటి ప్రభుత్వం గెజిట్ చేయకుండా ఆపిందని ఆరోపించారు. చట్ట ప్రకారం ఐదేళ్లకోసారి వేతనాల జీఓను సవరించాలన్నారు. కానీ 15 ఏళ్లయినా సవరణ చేపట్టడంలేదని వాపోయారు. 68వ షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్ కనీస వేతనాల జీఓలను సవరించి పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు శ్రావణ్‌కుమార్, అశోక్, రాములు, మహేందర్, మల్లేష్, మోహన్, జంగయ్య, రాజు, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలంలో బోర్‌వెల్ పనులకు శంకుస్థాపన

నల్లకుంట: నల్లకుంట డివిజన్ మాతృశ్రీ లేన్‌లో ఓ వృద్ధ దంపతులకు చెందిన సుమారు 1000 గజాల్లో పురాతన ఇల్లు ఉండేది. వయోభారంతో ఆ దంపలిద్దరూ మృతి చెందారు. కాగా వారికి వారసులెవరూ లేకపోవడంతో ఆ స్థలాన్ని సొంతం చేసుకునేందుకు కొందరు విశ్వప్రయత్నాలు చేశారు. దీనిని అడ్డుకున్న స్థానికులు విషయాన్ని నాటి ఎమ్మెల్యే, ప్రస్తుత కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్పందించిన ఆయన వెంటనే మండల రెవెన్యూ అధికారులతో మాట్లాడి ఆ స్థలాన్ని ఎవరూ కబ్జా చేయకుండా అడ్డుకున్నారు. అనంతరం స్థానికుల అవసరాల నిమిత్తం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చొరవతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ స్థలాన్ని పార్కు కోసం కేటాయించింది. ఇటీవల అక్కడ పార్కు నిర్మాణం కోసం స్థానిక ఎమ్మెల్యే కాలేరు సన్నాహాలు కూడా చేపట్టారు. ఈ క్రమంలో పార్కులో నీటి వసతి అవసరం ఉండడంతో స్థానికులు ఈ విషయాన్ని స్థానిక కార్పొరేటర్ అమృత దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్పందించిన కార్పొరేటర్ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో మాట్లాడి ఎంపీ నిధుల నుంచి బోర్‌వెల్ కోసం నిధులు మంజూరు చేయించారు. మంగళవారం బోర్ వేల్ ఏర్పాటు పనులకు స్థానికులతో కలిసి కార్పొరేటర్ అమృత శంకుస్థాపన చేశారు.

ప్రయాణికురాలి బ్యాగు చోరీ

కాచిగూడ: రైలు ప్రయాణికురాలి బంగారు, వెండి నగలు, నగదు ఉన్న హ్యాండ్ బ్యాగును దొంగలు తస్కరించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... సూరత్‌కు చెందిన నేహా జైస్వాల్ (26) కాచిగూడకు రావడానికి జైపూర్ -కోయంబత్తూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. రైలు మహారాష్ట్రలోని ముత్కేడ్ రైల్వే స్టేషన్ వద్దకు రాగానే ఆమె హ్యాండ్ బ్యాగు కనిపించలేదు. బ్యాగులో 12 గ్రాముల బంగారు ఆభరణాలు, 40 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.3వేల నగదు ఉంది. మంగళవారం నేహా జైస్వాల్ కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

బర్కత్‌పురలో రాఘవేంద్రస్వామి రథోత్సవం, వేడుకల్లో పాల్గొన్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో బృందావనంలోని స్వామివారు







మహా రథోత్సవం.. భక్తుల జయజయధ్వానం

కాచిగూడ: రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా చివరి రోజు బర్కత్‌పురలోని మఠంలో ఉత్తర రాధన విశేష పూజలను భక్తుల జయజయధ్వానాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి నిర్మల్య విసర్జనం,అష్టోత్తర పారాయణం, పాదపూజ, విశేష పంచామృతం, తులసి అర్చన, అలంకార, హస్తోదక, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ జరిగింది. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బర్కత్‌పుర పురవీధుల్లో మహా రథోత్సవం భజనలు, భక్తి గీతాలాపనలు మధ్య కొనసాగింది. మఠం మేనేజర్ ఎ.అనిల్ కుమార్, భక్తులు, వేద పండితులు పాల్గొన్నారు.

బృందావన సమితిలో...

కాచిగూడ, లింగంపల్లిలోని శ్రీ రాఘవేంద్ర బృందావన సమితిలో శ్రీ రాఘవేంద్ర స్వామి ఉత్తర రాధన పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో రథోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పల్లకీ సేవ చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బృందావన సమితి కార్యదర్శి బిపి. రాఘవేందర్ రావు, మేనేజర్ కె.నర్సింహాచార్య, కార్పొరేటర్ ఉమారమేష్ యాదవ్, బృందావన సమితి అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి, ట్రస్టీలు పాల్గొన్నారు.

ఎస్సీ ఉపకులాలకు న్యాయం జరిగేలా చూడండి



ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు వినతి పత్రం అందజేస్తున్న రమేష్‌బాబు

కాచిగూడ: ఎస్సీ వర్గీకరణ చట్టం 2025ను సవరించి మాలలతో పాటు 26 ఎస్సీ కులాలకు న్యాయం జరిగేలా చూడాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్‌బాబు మంగళవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మాల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు అందరూ కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి సమస్య పరిష్కారమయ్యే విధంగా చూడాలని కోరారు. ఎస్సీలలోని 26 ఉపకులాలలకు నష్టం కల్గిస్తున్న సంబంధిత చట్టాన్ని, రోస్టర్ పాయింట్లను సవరించి న్యాయం చేయాలని కోరామన్నారు. శాతవాహన యూనివర్సిటీలో 35 పార్ట్‌టైం లెక్చరర్ల నియామకంలో ఎస్సీలకు కేటాయించిన 6 ఉద్యోగాలలో ఒక్కటి కూడా మాల, మాల అనుబంధ కులాలకు దక్కలేదని తెలిపారు. ఆరోగ్య శాఖ, విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఇంజినీర్లు, లైన్‌మెన్‌ల ఉద్యోగాలలో న్యాయం జరిగేలా చూడాలని అభ్యర్థించినట్లు ఆయన వెల్లడించారు.

బీసీ రిజర్వేషన్ అమలులో సీఎంకు చిత్తశుద్ధి లేదు



జేఏసీ కార్యాలయాన్ని ప్రారంభించి అభివాదం చేస్తున్న విశారదన్ మహారాజ్, చిరంజీవులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదని బీసీ, ఎస్సీ,ఎస్టీ జేఏసీ కన్వీనర్ డా. విశారదన్ మహారాజ్ విమర్శించారు. నిజంగా ముఖ్యమంత్రి, పాలకవర్గాలకు బీసీల పట్ల ప్రేమ ఉంటే ఢిల్లీలోని ప్రధాన మంత్రి కార్యాలయం వద్ద ధర్నా చేసి సాధించాలన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఆర్ఎం జాక్ రాష్ట్ర కార్యాలయాన్ని బీసీ మేధావుల ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విశారదన్ మాట్లాడతూ... 42 శాతం రిజర్వేషన్‌ను చట్టబద్ధం చేసి 9వ షెడ్యూల్డ్‌లో చేర్చే వరకు ముఖ్యమంత్రిని వదలమని హెచ్చరించారు. పాలకవర్గాల పల్లకీని మోసే బోయిలము కాదని రేపు బీసీలను పల్లకీలో కూర్చోబెడతామని చెప్పారు. సచివాలయానికి ప్రత్యామ్నాయంగా నిలబడటానికే కార్యాలయాన్ని ప్రారంభించామని తెలిపారు. ఇది రాజ్యం కోసం జరిగే సమరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగొని బాలరాజ్‌గౌడ్, కన్వీనర్ వెంకన్నగౌడ్, ఎస్.దుర్గయ్య గౌడ్, నారాయణగౌడ్, కిషన్, రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రంగానగర్ వాంబే ఇళ్లను కూల్చి కొత్త ఇళ్లు కటిస్తాం



రంగానగర్‌లో శిథిలావస్థకు చేరుకున్న వాంబే ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, తహసీల్దార్లు

ముషీరాబాద్: ముట్టుకుంటే పడిపోయే స్థితిలో ఉన్న రంగానగర్ వాంబే ఇళ్లను త్వరలో కూల్చివేసి కొత్తగా ఇళ్లు నిర్మించి ఇస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ బాధితులకు హామీ ఇచ్చారు. రంగానగర్ వాంబే ఇళ్ల బాధితుల ఫిర్యాదు మేరకు మంగళవారం ఆయన సికింద్రాబాద్, ముషీరాబాద్ తహసీల్దార్లతో వెళ్లి ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వాంబే పథకం కింద 1998లో నిర్మించిన పక్కా గృహాలను 44 కుటుంబాలకు అందజేశారని తెలిపారు. ఈ ఇళ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని పేర్కొన్నారు. భవనంపై కప్పు పెచ్చులు ఊడి పడడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారని అననఆరు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన బాధితులకు ఇళ్లు కట్టించే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రంగానగర్ వాంబే ఇళ్లలో నివాసం ఉండే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ సన్నీ, బీఆర్‌ఎస్ నాయకులు బింగి నవీన్, వై.శ్రీనివాస్‌రావు, రహీం, కృష్ణ, ప్రవీణ్, సుమన్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడు వట్టికోట ఆళ్వారుస్వామి



చిక్కడపల్లి: తెలంగాణ నవయుగ వైతాళికుడు వట్టికోట ఆళ్వారుస్వామి అని సీబీఐ కోర్టు విశ్రాంత న్యాయమూర్తి నాగమారుతీశర్మ అన్నారు. మంగళవారం త్యాగరాయ గానసభలో వట్టికోట ఆళ్వారుస్వామి యాదిలో.. అనే శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప ధీశాలి అని కొనియాడారు. ఊరూరా గ్రంథాలయాల స్థాపనకు కృషి చేయడంతో పాటు నాటి రచయితల పుస్తకాలు ప్రచురించిన గొప్పవ్యక్తి అని అన్నారు. గానసభ అధ్యక్షుడు జనార్దనామూర్తి కేంద్ర గ్రంథాలయానికి ఆళ్వారుస్వామి పేరు పెట్టడం సముచితంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత శైలజామిత్ర, నటుడు మాణిక్, సినీదర్శకుడు మల్లం రమేష్ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీని అరికట్టడానికి యువత ముందుకు రావాలి



ఎయిడ్స్ అవగాహన సదస్సులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వాసం వెంకటేశ్వర్‌రెడ్డి

రాష్ట్ర ఏసీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హెచ్‌ఐవీని అరికట్టడానికి యువత కృషి చేయాలని తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏసీఎస్) ప్రాజెక్ట్ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రెండు వేర్వేరు అని హెచ్‌ఐవీ అనే వైరస్ బాడీలోకి ప్రవేశిస్తే ఎయిడ్స్‌గా వృద్ధి చెందుతుందన్నారు. మంగళవారం ఆర్‌టీసీ కళ్యాణ మండపంలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యూత్ డేను పరిష్కరించుకొని ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య పార్కు నుంచి ఆర్‌టీసీ కళ్యాణ మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభలో వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... ఈ ప్రపంచంలో ఎయిడ్స్ బాధితుల్లో మన దేశం మూడో స్థానంలో ఉందన్నారు. దేశ వ్యాప్తంగా 25 లక్షల మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఉన్నారని తెలిపారు. తెలంగాణకి వస్తే లక్ష 58 వేల మంది ఉన్నారని పేర్కొన్నారు. ఈ వ్యాధి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 42 ఎన్‌జీవో సంస్థల ద్వారా తగిన సేవలు అందిస్తున్నామని చెప్పారు. అనంతరం ఎయిడ్స్‌పై ముద్రించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జబర్దస్త్ కళాకారులు బుల్లెట్ భాస్కర్, హైమా ఆకట్టుకునేలా కళారూపాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ఓయూ కో ఆర్డినేటర్ ప్రొ. విద్యాసాగర్, జి.నరసింహారావు, జాయింట్ డైరెక్టర్ ఎస్.రవికుమార్, డిప్యూటీ డైరెక్టర్లు వనజ, మధుసూదన్, డాక్టర్ దాసరి పార్థసారథి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

కవాడిగూడ: విద్యారంగంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్పొరేటర్ అనుకూల విధానాల్ని తిప్పికొట్టి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, మేధావివర్గంపై ఉందని ఎస్‌టీఎఫ్‌ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి చావ రవి అన్నారు. మంగళవారం ఎస్‌టీఎఫ్‌ఐ 26 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దోమలగూడలోని రాష్ట్ర కార్యాలయంలో పతాకాన్ని ఆవిష్కరించారు. ఎస్‌టీఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రవిని కార్యకర్తలు అభినందనలు తెలిపారు. విద్యా కార్పొరేటీకరణను నిరోధించాలంటే ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్, నాయకులు సంయుక్త,కార్యదర్శి సింహాచలం, మహిళా కన్వీనర్ శారద తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మూఢనమ్మకాలు తొలగితేనే విద్యార్థులు అభివృద్ధి వైపు పయనిస్తారని హిప్నో థెరపిస్ట్ డా. హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 8, 9, 10 తరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. విద్యార్థులు తార్కిక ఆలోచనలతో పాటు సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. పిల్లల సృజనాత్మక శక్తిని పెంచినప్పుడే సైన్స్ అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎన్. సోమయ్య, విజ్ఞాన దర్శిని రమేష్, బుచ్చిరెడ్డి, సుజావతి, మమత, అంకమ్మ, పద్మ, నవీన్, ఆఫీస్ సెక్రటరీ బ్రహ్మణి, మహేష్ దుర్గే పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కాచిగూడ: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాకకు చెందిన భీమయ్య కుమారుడు కృష్ణ(48) గతంలో హౌస్ కీపింగ్ చేసేవాడు. ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈనెల 2వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు.స్నేహితుల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య లక్ష్మి మంగళవారం కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



యువజన కాంగ్రెస్ నియోజకవర్గ సమీక్షలో బండారు మధుసూదన్ తదితరులు

ముషీరాబాద్: సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సికింద్రాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బండారు మధుసూదన్ పిలుపునిచ్చారు. మంగళవారం రాంనగర్‌లో ముషీరాబాద్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ సమీక్ష సమావేశం అధ్యక్షుడు నరేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ.. విత్ ఐవైసీ యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అందులో నియోజకవర్గ సమస్యలపై ప్రతి యువజన కాంగ్రెస్ కార్యకర్త, నాయకులు పరిష్కరించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని పిలుపునిచ్చారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ ప్రధాన పాత్ర పోషించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు హుస్సేన్, సాయితేజ్, అజయ్, సాయియాదవ్, కరుణాకర్, మనోహర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఐక్యతతో హక్కులు సాధించుకోవాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న భారతీయ సమాజ్ సేవా సంఘ్ నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భవన నిర్మాణ కార్మికులు ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధన కోసం ముందుకు సాగాలని ఉత్తర భారతీయ సమాజ్ సేవా సంఘ్ నిషాద్ సాంగ్ యూపీ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్ నిషాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని దొడ్డి కొమురయ్య హాల్‌లో సేవా సంఘ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భవన నిర్మాణ కార్మికులుగా పనిచేసే వారు ఏకతాటిపైకి రావాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రతినిధి చంద్రమౌళి మాట్లాడుతూ... తెలంగాణలో దాదాపు 15–20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారన్నారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అన్ని రంగాలలో వెనుకబడ్డ వీరికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల అభివృద్ధికి పనిచేసే వారికే తమ మద్దతు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సురేందర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, రాజేందర్ నిషాద్, అరుణ్, అభిమన్యు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరిలో ఆధ్యాత్మిక భావనను పెంపొందించాలి



మహంకాళి ఆలయ పాలకమండలితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న అంజన్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించేందుకు నూతన ఆలయ పాలకమండలి కృషి చేయాలని మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం ముషీరాబాద్ మహంకాళి దేవాలయ నూతన పాలకమండలి సభ్యులతో ఆయన ప్రమాణస్వీకారం చేయించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన నరేష్‌కుమార్‌తో పాటు నూతన ధర్మకర్తలు ఆలయ ప్రాంగణంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆండాలు, శాఖ ఈవో మహేందర్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, నాగభూషణం, వెంకటేష్, జెనిగె శ్రీనివాస్‌యాదవ్, అంజిరెడ్డి, మాజీ కార్పొరేటర్ కల్పనాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి నుంచి పాలకమండలి నియామకంపై వివాదం...

మొదట ఎనిమిది మందితో ప్రమాణస్వీకారం చేయించాల్సి ఉండగా ఇద్దరు వ్యక్తిగత కారణాల వల్ల తమకు ఈ పదవులు వద్దని దేవాదాయ శాఖ అధికారులకు లేఖలు రాసిచ్చారు. మరో వ్యక్తి వయస్సు తక్కువగా ఉండడంతో అతడి నియామకాన్ని పరిగణలోకి తీసుకోలేదు. పూర్తిస్థాయి కమిటీ లేనప్పుడు ఎలా ప్రమాణస్వీకారం చేయిస్తారని స్థానికులు ప్రశ్నించారు. ఈ వివాదంపై కొద్దిసేపు చర్చలు జరిగాయి. అనంతరం ఐదు మందితో ప్రమాణస్వీకారం చేయించి పాలకమండలి ప్రకటించారు. మిగతా ధర్మకర్తలను త్వరలో నియమిస్తామని ప్రకటించారు.

అమీర్‌పేట్‌లో సీఎం పర్యటించడం ఎన్నికల స్టంట్

కవాడిగూడ: నగరంలో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అనేక లోతట్టు ప్రాంతాలు నీట మునిగితే పట్టించుకోని సీఎం రేవంత్‌రెడ్డి అమీర్‌పేట్ పర్యటించడం కేవలం జూబ్లీహిల్స్ ఉపఎన్నికల స్టంట్ మాత్రమేనని ఆప్ తెలంగాణ కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్ ఆరోపించారు. జీహెచ్‌ఎంసీకి కేటాయించిన బడ్జెట్‌ను ప్రభుత్వం విడుదల చేసి ఉంటే నగరానికి నేడు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారిన పడుతున్న వారికి సరైన వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. వర్షాలకు కంకరతేలిన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. నగర ప్రజల సమస్యలను పట్టించుకోని మేయర్ విజయలక్ష్మి వెంటనే రాజీనామా చేయాలన్నారు. మంగళవారం దోమలగూడలోని ఆప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విధంగా మాట్లాడారు.

లైబ్రరీ సైన్స్ పితామహుడు ఎస్‌ఆర్ రంగనాథన్



నగర కేంద్ర గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, అధికారులు

చిక్కడపల్లి: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి అన్నారు. లైబ్రేరియన్స్ డే సందర్భంగా మంగళవారం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో ఎస్‌ఆర్ రంగనాథన్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాలర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రంగనాథన్ లైబ్రరీ సైన్స్ పితామహుడని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి.పద్మజ, గ్రంథపాలకులు, ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి





తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేవైఎం కార్యకర్తలు, బీజేపీ నాయకులు, రాంనగర్ చౌరస్తాలో మాట్లాడుతున్న నవీన్‌గౌడ్, కార్పొరేటర్ కె.రవిచారి

ముషీరాబాద్: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ నవీన్‌గౌడ్ పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా ర్యాలీని అడిక్‌మెట్‌లోని అభయాంజనేయ స్వామి దేవాలయం నుంచి రాంనగర్ చౌరస్తా వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం కార్యకర్తలు భారత్ మాతాకీ జై అంటూ ముందుకు సాగారు. ఈ ర్యాలీలో రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి, రాంరెడ్డి, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షులు సాయికృష్ణయాదవ్, నందు, జగదీష్, నర్సింహ, బీజేవైఎం నాయకులు శ్యామ్, రాకేష్, బీజేవైఎం డివిజన్ అధ్యక్షులు సంతోష్‌యాదవ్, అనిల్, మణికంఠ, రాకేష్, మదర్ స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరంగా ర్యాలీ

కాచిగూడ: బర్కత్‌పురలోని రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల వద్ద ఈనెల 13వ తేదీన బుధవారం ఉదయం 10గంటలకు భారీ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పాల్గొంటారని తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలి



స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల శుద్ధి కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ పావని, బీజేపీ నేతలు

చిక్కడపల్లి: స్వాతంత్ర్య సమరయోధుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కార్పొరేటర్ పావని అన్నారు. హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా మంగళవారం అరుంధతినగర్‌లోని బాబు జగ్జీవన్‌రామ్, బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాలను శుద్ధి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, నాయకులు వి.నవీన్‌కుమార్, శ్రీకాంత్, ఉమేష్, ఆనంద్‌రావు, సాయికుమార్, దోనేటి సత్యం, జ్ఞానేశ్వర్, ప్రశాంత్, శ్రీనివాస్‌గౌడ్, అస్త్రోపాత్ర, అనిత, మంజుల తదితరులు పాల్గొన్నారు.